సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం । 4 । ఫిబ్రవరి । 2025



ఈసారీ మామిడికి దెబ్బేనా.?

మామిడి రైతులకు ఫలితాలు ఈ ఏడాది కూడా ఆశాజనకంగా లేవు. వాతావరణ మార్పులతో రావాల్సిన పూత రాకుండా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. - 8లో



ఎర్రచందనం దుంగలు స్వాధీనం

వాహనంతో సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రియాంక సోమవారం తెలిపారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.170	రూ.210
రెండోరకం	రూ.110	రూ.160



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 45 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	650	650
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 43.680 కిలోలు

న్యూస్‌రీల్

10న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

రాయచోటి : వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో దీనికి సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. పిల్లలు, కిషోర బాలికలకు (ఒక సంవత్సరం నుంచి 18 సంవత్సరాల వయస్సుగల పిల్లలకు) ఉచితంగా ఆల్బెండజోల్ మాత్ర పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్‌డీసీ రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శైలజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందే ఫిర్యాదులకు సత్వరం పరిష్కారం చూపాలని, బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించారు. సోమవారం రాయచోటిలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజల నుంచి వినతులను స్వీకరించి వారితో మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సమస్యల పరిష్కారం కోరుతూ పోలీస్ స్టేషన్ గడప తొక్కిన వారందరికీ చట్టపరిధిలో పరిష్కారం చూపించాలని ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు.

ఇంటర్ ప్రాక్టికల్, పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఏఓ నాగభూషణం

రాయచోటి : జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పరిపాలన అధికారి నాగభూషణం సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు 2025–26 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో జరగబోయే ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్ పరిపాలన అధికారి అధ్యక్షతన ఇంటర్మీడియట్ విద్య, ఏపీఎస్ఆర్టీసీ, పోలీస్, వైద్య, విద్యుత్, తపాలా తదితర శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలు గురించి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎం కృష్ణయ్య వివరించారు. జిల్లాలో ఈనెల 10వ తేదీ నుంచి 19 వరకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తామన్నారు. అలాగే మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షలకు సంబంధించి 49 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లను నియమించినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఏఓ సూచించారు. సమావేశంలో ఇంటర్మీడియట్ విద్య, పోలీసు, వైద్య, ఎస్పీడీసీఎల్, ఆర్టీసీ, తపాలా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పల్లకీ ఉత్సవం



పల్లకీలో ఊరేగుతున్న భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌లను రంగు రంగుల పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం పల్లకీలో కొలువుదీర్చారు. ఆలయ మాఢవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో డివి రమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

■ కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

దేవదేవుడి దివ్య మోహన రూపాన్ని తిలకిస్తున్న భక్తులకు ఇరువైపులా అరటిపిలకలు స్వామి కల్యాణ శోభను రెట్టింపు చేశాయి. మామిడి తోరణాలు మంగళకరమైనదని చాటుతున్నట్లు కనిపించాయి. సమ్మోహన రూపంలో ధగధగలాడే నూతన వస్త్రాలతో వరుడిగా కడప రాయుడు కొలువుదీరగా, మరోవైపు ముగ్ధ మనోహర రూపాలతో శ్రీదేవి, భూదేవి అమ్మవారలు వధువులుగా ఒదిగి కూర్చొన్నారు. మంచి గంధం, మధుర పరిమళం, మంగళ వాయిద్యాల సుస్వరాలు మైమరిపిస్తుండగా దేవ దేవుడి కల్యాణం.. ఆద్యంతం కమనీయంగా జరిగింది. అర్చకులు స్వామి పక్షాన అమ్మవారల గళసీమల్లో మంగళ సూత్రాలను అలంకరించారు. తలంబ్రాలు కార్యక్రమాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహించారు. అనంతరం లాజహోమం నిర్వహించారు. కడప రాయుని కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కడపరాయుని కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. – కడప కల్చరల్



భక్తులకు మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకులు

కల్తీ కథ.. ఎవరి పాత్ర ఎంత?

- తెలుగుతమ్ముళ్ల నేతృత్వంలో కల్తీ మద్యం నెట్‌వర్క్
- స్పిరిట్‌తో మద్యం తయారీ
- మందుబాబుల ప్రాణాలతో చెలగాటం



సాక్షి ప్రతినిధి, కడప : ఎన్నికలకు ముందు నాణ్యమైన మద్యం...సరసమైన ధరల్లోనే ఇస్తానని చంద్రబాబు ఇచ్చిన హామీ అధికారంలోకి వచ్చాక రివర్స్ అయ్యింది. విచ్చలవిడి మద్యం షాపులు, వాటికి అనుసంధానంగా బెల్టు షాపులు యథాతథం కాగా..ఇప్పుడు కల్తీ మద్యం మాఫియా మొదలైంది. కేవలం స్పిరిట్ నింపి మందు బాబుల గొంతులు తడుపుతున్నారు. దీని కోసం తిరుపతి, రైల్వేకోడూరు, రాజంపేట ప్రాంతాల్లో ప్రత్యేకంగా తయారీ కేంద్రాలు కూడా వెలిశాయి.

ఇప్పటికే 90 రూపాయలకే ఇచ్చే మద్యంపై అనేక అనుమానాలుంటే...తాజాగా కూటమి ప్రభుత్వంలో కల్తీ మద్యం దందా ప్రారంభమైంది. కేవలం స్పిరిట్‌తో మద్యం తయారు చేస్తూ మందు బాబుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కేరళ నుంచి స్పిరిట్ తెప్పించి...అన్నమయ్య జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో కల్తీ మద్యం తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసి విచ్చలవిడిగా మార్కెట్‌లోకి వదిలేస్తున్నారు. ఎన్నికలకు ముందు నాణ్యమైన మద్యం అందిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మాట దేవుడెరుగు.. ఇప్పుడు కల్తీ మద్యాన్ని అరికట్టలేని పరిస్థితికి వచ్చేసింది. కూటమి నేతల కనుసన్నల్లోనే ఈ వ్యాపారం సాగుతుందనేది బహిరంగ రహస్యమే. అయినా వాళ్ల పేర్లు బయటకు రాకుండా అనామకులపై కేసులు పెట్టి చేతులు దులుపుకుంటున్నారు. ఇటీవల తిరుపతిలో ఈ మద్యం రాకెట్ వెలుగులోకి రాగా రెల్వేకోడూరులో రెండు సార్లు ఎక్సైజ్ అధికారులు కల్తీ మద్యాన్ని స్వాధీనం చేసుకుని తయారీ కేంద్రాలను కూడా గుర్తించారు.

లోతైన విచారణకు పాతర...

కల్తీ మద్యం కోసం తిరుపతి కేంద్రంగా పెద్ద నెట్‌వర్క్ నడుస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ విషయం ఎక్సైజ్‌శాఖ అధికారులకు తెలిసినా బడాబాబుల పేర్లు బయటకు రాకుండా అనామకులను కేసులో పెట్టి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు మెండుగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే తిరుపతి, రైల్వేకోడూరుతో పాటు రాజంపేటలోనూ ఈ నకిలీ మద్యం తయారీ కేంద్రాలను గుర్తించి దాడులు చేశారు. దీంట్లో ఒకరిద్దరిని అరెస్టు చేసి చేతులు దులుపుకున్నారు. కానీ ఈ రాకెట్ వెనుక ఎవరున్నారు..? కేరళ నుంచి స్పిరిట్ ఎవరు తెప్పిస్తున్నారు..? లేబుళ్లు, స్టిక్లర్లు ఎక్కడ తయారవుతున్నాయనే కోణంలో మాత్రం స్పష్టత లేకుండా పోయింది. లోతైన విచారణకు పాతరేశారు. రాజంపేట తయారీ కేంద్రాన్ని గుర్తించినప్పుడు తమకు కావాల్సిన వారి పేర్లు బయటకు రాకుండా ఉండటం కోసం తిరుపతికి చెందిన ఓ నేత రోజంతా రాజంపేట అధికారుల చుట్టూనే తిరిగినట్లు సమాచారం. ఒక్కో చోట వేల లీటర్ల స్పిరిట్, వందల కొద్దీ బాటిళ్లు, స్టిక్కర్లు, లేబుళ్లు దొరుకుతున్నాయి. ఇవన్నీ తిరుపతి కేంద్రంగానే వస్తున్నాయనే ప్రచారం సాగుతోంది. దొరికిన ప్రాంతాలను పక్కన పెడితే ఇంకా ఎక్కడెక్కడ ఈ దందా ఎంతమేరకు విస్తరించిందనే కోణంలో విచారణ కొనసాగడం లేదు. ఎక్సైజ్ అధికారులు మాత్రం స్థానికంగా దొరికిన వారిని అరెస్ట్ చేసి మమ అనిపిస్తున్నారు తప్ప కల్తీ మద్యం రాకెట్ సూత్రధారులు, పాత్రధారులు ఎవరన్న కోణంలో విచారణ చేపట్టడం లేదు. దీనికి రాజకీయ ఒత్తిళ్లే కారణమనే విమర్శలూ లేకపోలేదు.

▶▶ జంకుతున్న ఎక్సైజ్‌శాఖ...

అధికారపార్టీ నేతల నోటి దూలకు ఎక్సైజ్‌శాఖ జంకుతోంది. అందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. వైఎస్సార్ జిల్లా కమలాపురం, వీరపునాయునిపల్లె ప్రాంతాల్లో అనధికారిక మద్యం షాపులు వెలిశాయి. బ్రాందీషాపుల నిర్వాహకులతో సంబంధం లేకుండా బంకులు ఏర్పాటు చేసి మద్యం షాపులను కొనసాగిస్తున్నారు. అధికారిక మద్యం షాపునకు చెంతలోనే తెలుగుతమ్ముళ్లు అక్రమంగా మద్యం షాపులను కొనసాగిస్తున్నా నియంత్రించే దిశగా ఎక్సైజ్‌శాఖలో అడుగులు పడడం లేదు. ఇలాంటి పరిస్థితి జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఉంది. అధికార పార్టీ నేతల భాగస్వామ్యం లేని మద్యం షాపుల నిర్వాహకులకు చుక్కలు చూపిస్తున్నారు. ఓవైపు కల్తీ మద్యం మరోవైపు విచ్చలవిడి బెల్ట్‌షాపులతో తెలుగుతమ్ముళ్లు ఎక్సైజ్‌శాఖ యంత్రాంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

నేటి నుంచి క్రీడా, సాంస్కృతిక సంబరం

రైల్వేకోడూరు అర్బన్ : అన్నమయ్య జిల్లా అనంతరాజునేటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాలల రాష్ట్రస్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు మంగళవారం నుంచి జరగనున్నాయి.7వతేదీ వరకు జరిగే ఈ పోటీలకు 9 కళాశాలలకు చెందిన క్రీడాకారులు హాజరుకానున్నారు.సోమవారం డీఎస్‌ఏ డాక్టర్ సూర్యకుమారి, అసోసియేట్ డీన్ శ్రీనివాసులు క్రీడల నిర్వాహణకు ఏర్పాట్లు, క్రీడాకారులకు వసతులను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ పరిధిలో 9 ఉద్యాన కళాశాలలు ఉన్నాయని, మొత్తం 3 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. క్రీడా 7 సంవత్సరాల తరువాత రెండోసారి ఇక్కడ క్రీడా, సాంస్కృతిక సంబరాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్య అతిథిగా వీసీ గోపాల్, విశిష్ట అతిథులుగా రాష్ట్ర శాప్ చైర్మన్ రవినాయుడు, రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామనాథ్‌హెగ్డే హాజరుకానున్నట్లు తెలిపారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

5 అంశాల్లో పోటీలు:

9 ఉద్యాన కళాశాలల నుంచి 450 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొననున్నారు. క్రీడలు, డ్యాన్స్, లిటరరీ, ఫైన్ ఆర్ట్స్ విభాగంలో పోటీలు ఉంటాయి. ఇందులో ప్రతిభ కనబరిన వారిని జాతీయ స్థాయి పోటీలకు పంపనున్నారు.మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మార్చ్‌ఫాస్ట్ జరుగుతుంది. జ్యోతిప్రజ్వలన అనంతరం పోటీలు ప్రారంభమవుతాయి.

సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి : ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకొని పరిష్కరించాలన్నారు. ప్రజల నుంచి అందిన విజ్ఞప్తులను పరిశీలించి అక్కడే ఉన్న ఆయా శాఖల అధికారులతో ఫిర్యాదుదారులను పరిచయం చేయించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్‌డీసీ రమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

గోడపత్రిక ఆవిష్కరణ

రాయచోటి జగదాంబసెంటర్ : ఐక్యరాజ్యసమితి, 2025వ సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా గుర్తించింది. ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టరేటలో జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రికను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆవిష్కరించారు.

జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీ ఇంటిపై దాడి అమానుషం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి

- నిందితులను అరెస్టు చేయాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన క్యాదర్శి శ్రీకాంత్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి జెడ్పీటీసీ రమాదేవి, మాజీ ఎంపీపీ అంపాబత్తిన రెడ్డయ్య ఇంటిపై, కుటుంబంపై దాడి చేయడం అమానుషం, సిగ్గుమాలిన చర్య అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. లక్కిరెడ్డిపల్లి మండలం, జాండ్రపల్లిలో సోమవారం జెడ్పీటీసీ రమాదేవి, మాజీ ఎంపీపీ అంపాబత్తిన రెడ్డయ్య కుటుంబాన్ని స్థానిక నాయకులతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. ఇంటిలో ధ్వంసమైన వస్తువులను, కాల్చేసిన బుల్లెట్ బైక్‌ను పరిశీలించారు. బాధిత కుటుంబానికి తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం శ్రీకాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ బీసీ నాయకుడు అంపాబత్తిన రెడ్డయ్య సుమారు 15 ఏళ్ల సర్పంచ్‌గా, ఐదేళ్ల క్రితం ఎంపీపీగా, ప్రస్తుతం ఆయన సతీమణి రమాదేవి జెడ్పీటీసీగా కొనసాగుతున్నారన్నారు. వారి గ్రామంలో ప్రభుత్వం కేటాయించిన నిధులతోపాటు కొంత నిధులు కలిపి గ్రామాభివృద్ధికి పరితపిస్తున్న వ్యక్తి రెడ్డయ్య అని తెలిపారు. బీసీల రక్షణ చట్టం తెస్తామని కూటమి నాయకుల మాటలు ఏమయ్యాయి? ఇది భక్షక చట్టం కాదా? అని ఆయన ప్రశ్నించారు. అధికారం ఉంది కదా అని రాజకీయాలతో, ద్వేషాలతో ఇళ్లలోకి చొరబడి మహిళలుపైన దాడులు చేసి బీభత్సవం చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ పాలనలో సామాన్యులకు రక్షణ లేదని, మహిళలు రోడ్డుపైకి వచ్చే పరిస్థితి లేదన్నారు. వందలు, వేల మంది మహిళలు అదృశ్యమవుతున్నారన్నారు. ప్రశ్నిస్తే వారిపై దాడులు చేస్తున్నారన్నారు. ఈ నియోజకవర్గాన్ని గతంలో తాము ప్రశాంతంగా తీర్చి దిద్దామన్నారు. ప్రస్తుతం నాలుగు లక్షల జనాభా కలిగిన నియోజకవర్గంలో ప్రజల ఆత్మస్థైర్యం దెబ్బతినే విధంగా కొంతమంది ప్రవర్తిస్తున్నారన్నారు. నలభై, యాభై మంది తాగుబోతులు, గంజాయి తాగేవారు అరాచకాలు చేస్తుంటే చూస్తూ ఊరుకుంటామా అని ఆయన హెచ్చరించారు. మహిళలపై దాడికి పాల్పడి గ్రామంలో అలజడి సృష్టించిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇటువంటి సంఘటనలపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు దృష్టి పెట్టాలన్నారు. సుదీర్ఘకాలం రాజకీయాలలో ఉన్న అంపాబత్తిన రెడ్డయ్య ఇంట్లోకి అక్రమంగా, దౌర్జన్యంగా ప్రవేశించి సామాన్లు, అద్దాలను ధ్వంసం చేయడమే కాకుండా ఎనభై సంవత్సరాల వయస్సు ఉన్న ఆయన తల్లిపై, గర్భిణి అయిన కోడలిపై దాడి చేస్తారా? మీకు సిగ్గుందా అని ఆయన ప్రశ్నించారు. ఈ సంఘటన జరిగిన వెంటనే జిల్లా ఎస్పీతో కూడా మాట్లాడి దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. గాలివీడులో దాడి జరగకపోయినా దాడిలో చిత్రీకరించి నానా రభస చేశారని, అందుకోసం ప్రత్యేక విమానంలో వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ రోజు బీసీ బిడ్డ కోసం నోరు తెరవరా అని ప్రశ్నించారు. పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే తమ ఆలోచనలను మార్చుకోవాల్సి వస్తుందన్నారు.ఈ సంఘటనపై జిల్లా అధికారులు, నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీజీపీ చిత్తశుద్ధితో ఆలోచనలు చేసి నిందితులను అరెస్టు చేయాలని శ్రీకాంత్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రయోగం.. ప్రహసనం

- పరికరాలు, రసాయనాలకు నిధులు నిలిపివేసిన ప్రభుత్వం
- థియరీ పరీక్షలకే పరిమితమైన కార్పొరేట్, ప్రైవేటు కాలేజీలు
- ఈనెల 5 నుంచి ఒకేషనల్ 10 నుంచి జనరల్ సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలు

జిల్లాలో జూనియర్ కాలేజీలు	: 152
ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రాలు	: 78
హాజరుకానున్న విద్యార్థులు	: 10,228 మంది



ప్రాక్టికల్స్ చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

మదనపల్లె సిటీ : ప్రతి విద్యార్థికి పదో తరగతి తర్వాత ఇంటర్మీడియట్ విద్య చాలా కీలకం. ఇక్కడ వెనుకబడిపోతే జీవితాంతం చదువు మీద ప్రభావం చూపుతుంది. ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులతో ఉత్తీర్ణులైతే మంచి భవిష్యత్తు ఉంటుంది. జిల్లాలోని పలు ప్రభుత్వ కాలేజీలు, కేజీబీవీ, హైస్కూల్ ప్లస్ కాలేజీలో ల్యాబ్ సౌకర్యాలు అరకొరగా ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీ ల్యాబ్‌లకు అందజేయాల్సిన రసాయనాలను ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాది జనరల్ సైన్స్, ఎంపీసీ, బైపీసీ, ఒకేషనల్ విద్యార్థులు 10,228 మంది అసౌకర్యాల మధ్య ప్రాక్టికల్స్ పరీక్షలు రాయనున్నారు. ఈనెల 5వతేదీ నుంచి 20వతేదీ వరకు ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు, ఈనెల 10వతేదీ నుంచి 20వతేదీ వరకు జనరల్ సైన్స్ కోర్సు విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు జరగనున్నాయి.

గత ప్రభుత్వం ప్రైవేట్ ,కార్పొరేట్ హవాను తగ్గించింది. సైన్స్ గ్రూపులు ఉన్న కాలేజీల్లో తప్పనిసరిగా ప్రయోగశాలలు ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రాక్టికల్స్ చేయించాల్సిందిగా నిబంధనలు పెట్టింది. అంతేకాకుండా ప్రాక్టికల్స్.. పబ్లిక్ పరీక్షలకు వచ్చేసరికి జంబ్లింగ్ విధానం అమలు చేసి కార్పొరేట్,ప్రైవేట్ కాలేజీల ఆధిపత్యానికి చెక్ పెట్టింది. ప్రస్తుతం జంబ్లింగ్ విధానం ఎత్తివేయడంతో కార్పొరేట్, ప్రైవేట్ కాలేజీలకు వరంగా మారింది. ఈ క్రమంలో పబ్లిక్ పరీక్షలు తమ కళాశాలలో ఎవరో ఒక ఇన్విజిలేటర్‌ను వేయించుకుని వాళ్లకి నచ్చినట్లుగా మార్కులు వేయించుకునేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.


ప్రాక్టికల్స్ చేయించని ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు

ఇంటర్మీడియట్‌లో సైన్స్ గ్రూపులకు చాలా డిమాండ్ ఉంది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ లాంటి సబ్జెక్టులు చదవడం కష్టం. అయినా సరే భవిష్యత్తులో రాణించాలనే ఉద్దేశంతో విద్యార్థులు కష్టపడి చదువుతున్నారు. ప్రైవేట్,కార్పొరేట్ కాలేజీల్లో సరైన ప్రయోగశాలలు, పనిముట్లు, రసాయనాలు లేకపోవడంతో కేవలం థియరీతో మాత్రమే సరిపెట్టుకుని విద్యా సంవత్సరాన్ని ముగిస్తున్నారు. ప్రాక్టికల్స్ పరీక్షలు వచ్చాక అడ్డదారుల్లో విద్యార్థులకు అధిక మార్కులు వేయించుకునేలా ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశాం

ప్రాక్టికల్స్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రాక్టికల్స్ సీసీ కెమరాల నిఘా మధ్య జరుగుతుంది. ఎలాంటి అవకతవకలు జరగకుండా గట్టి చర్యలు చేపట్టాం.ఇందుకు అవసరమైన సామగ్రి అందించాం.

– ఎం.కృష్ణయ్య, ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా అధికారి,



స్కేటింగ్‌లో చిన్నారులకు పతకాలు

రాజంపేట టౌన్ : రాజంపేట పట్టణానికి చెందిన లక్ష్మీస్నేహిత, శౌర్యసింహవర్మలు జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. ఈవిషయాన్ని వీకే స్కేటింగ్ అకాడమి కోచ్ వినోద్ కుమార్ సోమవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఈఏడాది జనవరి 31వ తేదీ నుంచి మూడు రోజుల పాటు తమిళనాడు రాష్ట్రం మధురైలో జరిగిన జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో లక్ష్మీస్నేహిత అండర్–4 విభాగంలో 200 మీటర్ల క్యాడ్ రిలేరేస్ పోటీలో, శౌర్యసింహవర్మ అండర్–6 విభాగంలో 200 మీటర్ల రిలేరేస్ పోటీలో బంగారు పతకాలు సాధించారని తెలిపారు.గతనెలలో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో లక్ష్మీస్నేహిత 200 మీటర్ల విభాగంలో సిల్వర్ మెడల్, 400 మీటర్ల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించిందన్నారు. శౌర్యసింహ వర్మ 200 మీటర్ల విభాగంలో సిల్వర్ మెడల్, 400 మీటర్ల విభాగంలో బ్రాంజ్‌మెడల్ సాధించినట్లు తెలిపారు.

అండర్–8 విభాగంలో తేజసాయి 200 మీటర్ల విభాగంలో సిల్వర్ మెడల్, 400 మీటర్ల విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించినట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన వీరిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు.



లక్ష్మీస్నేహిత



శౌర్యసింహవర్మ

క్లుప్తంగా

లారీ దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసు అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండల పరిధిలోని కుక్కలదొడ్డి పంచాయతీ ప్రధాన రహదారిపై గతనెల 28వ తేదీన జరిగిన లారీ దొంగతనం కేసులో తెలంగాణ రాష్ట్రం, గద్వాల్ జిల్లా, మాన్వాడాకు చెందిన షేక్ మౌలాలిని అరెస్టు చేశారు. ఈమేరకు నిందితుడిని సోమవారం సీఐ హేమసుందర్, ఎస్‌ఐ నవీన్ బాబు కోర్టులో హాజరు పరిచారు. రైల్వేకోడూరు సివిల్ కోర్టు జడ్జి నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించారు.

వాహనం సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ఎర్రచందనం తోపాటు నిందితుడిని అరెస్టు చేసిన ఫారెస్ట్ అధికారులు

పీలేరు : వాహనంతో సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రియాంక తెలిపారు. ఆదివారం రాత్రి నుంచి పీలేరు – తలపుల మార్గంలో వాహనాలు తనిఖీ చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున అనుమానాస్పదంగా వచ్చిన కారును సిబ్బంది ఆపే ప్రయత్నం చేశారు. అయితే డ్రైవర్ వేగంగా ముందుకు వెళ్లడంతో సిబ్బంది వెంబడించి గూడరేవుపల్లె సమీపంలో పట్టుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా మూడు ఎర్రచందనం దుంగలు గుర్తించి వాహనంతోపాటు స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడుకు చెందిన విజయ్‌కాంత్‌ను అరెస్టు చేసినట్లు ఎఫ్ఆర్ఓ తెలిపారు.


ప్రథమ చికిత్స కేంద్రం సీజ్

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణం వేంపల్లి రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విజయ జ్యోతి ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేసినట్లు ఎర్రగుంట్ల పట్టణ ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

ఈసారీ మామిడికి దెబ్బేనా.?

జిల్లాలో మామిడి మామిడి (హెక్టార్లలో)

మండలం	మామిడి
రైల్వేకోడూరు	7584
రాయచోటి	9373
రాజంపేట	6227
మదనపల్లె	2010
పీలేరు	8531
తంబళ్లపల్లి	2137



రైల్వేకోడూరు మండలంలో పూతరాని మామిడి చెట్లు

- అనుకూలించని వాతావరణం
- రాని పూత.. ఆందోళనలో రైతులు

రైల్వేకోడూరు అర్బన్ : మామిడి రైతులకు ఫలితాలు ఈ ఏడాది కూడా ఆశాజనకంగా లేవు. వేలాది ఎకరాలలో పండిస్తూ జీవనం సాగించే రైతులకు ఈ ఏడాది మామిడి పంట దెబ్బ కొడుతూ ఉంది. ఇలాగే ప్రతి ఏడాది తెగుళ్లు, దళారీల మోసాలు, గిట్టుబాటు ధరలు లేక రైతులు లక్షలాది రూపాయలు అప్పుల్లో కూరుకుపోతున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఉద్యాన పంటల ధరలు ఓ మోస్తరు ఉన్నప్పటికీ ప్రకృతి సహకరించక వచ్చిన పంటలను నష్టపోతున్నారు. అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరు, రాయచోటి, రాజంపేట, మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి నియోజకవర్గాలలోని రైతులు అధిక శాతం మామిడి సాగు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. గత రెండు నెలలుగా వాతావరణం మార్పులతో రావాల్సిన పూత రాకుండా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు మంచు కురుస్తుండడంతో మామిడిచెట్లకు అంతంత మాత్రంగా వచ్చిన పూత కాస్త ఉంటుందో, రాలిపోతుందోనని మామిడి రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతులు మామిడి పంటలో వస్తున్న నష్టాలకు తోటలను తొలగించి అరటి, బొప్పాయి పంటల వైపు చూస్తున్నారు. ఇలాగే కొనసాగితే మామిడి పంటను పండించే రైతులు కరువయ్యే అవకాశం ఉంది.

మందుల పిచికారీ రైతులకు పెనుభారం

రైతులకు ఈ ఏడాది మామిడి వ్యవసాయం ప్రారంభ దశలోనే పూత తక్కువగా వచ్చి ఉన్నపూత కాస్త మంచు ఎక్కువగా కురిసి రాలిపోతూ ఉండడంతో మందుల పిచికారీ రైతులకు పెనుభారంగా మారింది. దున్నకాలు, క్రిమిసంహారక మందులకు వేలాది రూపాయలు వెచ్చించి మందులు పిచికారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు పూతకు పిందెలు వస్తాయా రావా అని అనుమానంతో ఉన్నారు. పూత ఆలస్యమై ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో పిందెలు వస్తే రాలిపోయే ప్రమాదముంది. సాధారణంగా ప్రతి ఏడాది జనవరి నెల చివరికి మామిడిపూత పిందె దశలో ఉంటుంది.

నష్టాల బాటలో మామిడి రైతులు

జిల్లాలో మామిడి పంటను రైతులు వేలాది ఎకరాలలో పండిస్తూ ఉన్నారు. గత ఏడాది మామిడి రైతులకు నష్టాలే మిగిలి అప్పుల పాలయ్యారు. ఉన్న పూత కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడి అప్పులు చేసి మందులు పిచికారీ చేయాల్సి వచ్చింది. గతంలో ఎకరాకు రూ.40 వేలు ఖర్చు వస్తే ఈ ఏడాది అది కాస్త రూ.60 వేలకు పైగా పెట్టుబడి అవుతూ వుంది. ప్రతి ఏడాది తెగుళ్లు, దళారీల మోసాలు, గిట్టుబాటు ధరలు లేక రైతులు లక్షలాది రూపాయలు అప్పులో కూరుకుపోయారు. ఈ ఏడాదన్నా పంట బాగా చేతికి వస్తుందనుకొంటే నష్టాలే మిగిలేలా ఉందని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

పూర్తిగా పూత రాకపోవడం ఆందోళనకరమే



నాకు 5 ఎకరాల మామిడి తోట ఉంది. తోటలో పూత పూర్తిశాతం ఇంకా రాక పోవడం చూస్తుంటే ఈ ఏడాది కూడా మామిడి దిగుబడి అనుమానమే. గత ఏడాది బాగా వస్తుందనుకొంటే ఇలాగే పూత ఆలస్యంగా మొదలైంది. ఇప్పుడూ వచ్చిన పూత కాస్త రాలుతుండడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఉన్న పూతను మందులు పిచికారీ చేసి కాపాడుకుంటున్నాం.

– నాగేంద్ర, గాండ్లపల్లి, లక్కిరెడ్డిపల్లి, రాయచోటి

దళారుల మోసాలతో నష్టపోతున్నాం



పెరిగిన పెట్టుబడులతో బొప్పాయి పంట ఎంత నాణ్యంగా పండించినా చివరకు దళారుల దెబ్బకు అప్పులే మిగులుతున్నాయి. ప్రభుత్వం ప్రతి పంటకు గిట్టు బాటు ధరలు కల్పించి రైతులను ఆదుకుంటే ధరలు తగ్గినా పెట్టుబడులన్నా మిగులుతాయి.

-వల్లూరు మురళీమోహన్‌రెడ్డి, రైతు, మందరం, రాజంపేట

సస్యరక్షణ చర్యలు పాటించాలి



రైతులు పూత, పిందెను కాపాడుకోవడానికి ఉద్యాన అధికారుల సలహాల మేరకు మందులు పిచికారీ చేయాలి. వర్షం, అధిక మంచు, ఎండల వల్ల పూత దశలో ఉన్న పంటలకు నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నాయి. అనుమానాలు ఉన్న రైతులు ఉద్యాన అధికారులను సంప్రదించండి. అలాగే గ్రామాలలో రైతులకు పంట కాపాడుకోవడానికి సూచనలు ఇస్తున్నాం.

-వెంకటభాస్కర్, ఉద్యానశాఖ అధికారి, రైల్వేకోడూరు

బీసీలపై దాడులు అమానుషం



మాట్లాడుతున్న శిబ్యాల విజయ భాస్కర్

రాయచోటి అర్బన్ : బడుగు, బలహీన వర్గాల ఓట్లతో గద్దెనెక్కి తిరిగి అదే వర్గాల ప్రజలపై దాడులు చేయడం అమానుషమని వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్ విమర్శించారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లె జెడ్పీటీసీ అంబాబత్తిన రమాదేవి ఇంటిపై కొందరు అల్లరిమూకలు మాస్కులు ధరించి దాడిచేయడం దారుణమన్నారు. రమాదేవి భర్త రెడ్డెయ్యతో పాటు ఆయన కుమారుడిని హతమార్చాలని ప్రయత్నించడం, మహిళలనే కనికరం లేకుండా కొట్టడం, ఇంటి ముందున్న బైకులను తగుల బెట్టడం దుర్మార్గమన్నారు. అభివృద్ధి గురించి ప్రశ్నించే వారిపై దాడులు చేయడమే కూటమి ప్రభుత్వం దృష్టిలో అభివృద్ధా అని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సుగవాసి శ్యామ్‌కుమార్, రాయచోటి బీసీ విభాగం అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం ఎగువపేటకు చెందిన కమలకూరు రాజన్న అనే వ్యక్తి వద్ద నుంచి సోమవారం 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ సుబ్బరామచంద్రుడు తెలిపారు. సిద్దవటంలోని ప్రధాన బస్టాండ్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో దాడి నిర్వహించి రాజన్నను అరెస్టు చేశామన్నారు.

చెరువు ఆక్రమణదారులపై కేసు నమోదు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని గంగపేరూరులో గల చిన్న చెరువును ఆక్రమించిన వారిపై సోమవారం ఒంటిమిట్ట ఎస్‌ఐ శివప్రసాద్ కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు కడప ఇరిగేషన్ సహాయ కార్యనిర్వహణాధికారి ఎస్.సాయి కిషోర్ ఫిర్యాదు మేరకు గంగపేరూరు గ్రామంలోని సర్వే నంబరు. 150లో 116.50 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇందులో ఆర్ఎస్ఆర్ ప్రకారం చిన్న చెరువు ఉంది. సదరు చెరువును ఆనుకుని ఉన్న పట్టా భూముల రైతులు 26.03 ఎకరాల చెరువు భూమిని ఆక్రమించినట్లు విలేజ్ రెవెన్యూ అధికారి నివేదిక ఇచ్చారు. గత ఏడాది సెప్టెంబర్ 21వ తేదీన సుమారు వారం రోజులు రెవెన్యూ అధికారులతో కలిసి ఆక్రమణలను తొలగించి సరిహద్దుల కందకాలను తవ్వించారు. కానీ ఈ చెరువును తిరిగి కొంతమంది ఆక్రమించారని తెలియడంతో జనవరి 25వ తేదీన రెవెన్యూ అధికారులతో పరిశీలించారు. 13.68 ఎకరాల భూమిని అదే వ్యక్తులు ఆక్రమించారని విలేజ్ రెవెన్యూ అధికారులు నివేదించారు. దీంతో ఆక్రమణకు పాల్పడిన ఎర్రబాబు సుబ్బారెడ్డి, మద్దిక రుక్మిణమ్మ, మద్దిక సావిత్రమ్మ, మద్దిక నరసారెడ్డి, మామిడి అబ్బిరెడ్డి, ముత్యాలపాటి రుద్రమ్మ, కొత్తపల్లి లలితలపై ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

ఆధిక్యంలో ఆంధ్రా జట్టు



152 పరుగులు చేసిన త్రిడిల్ పి సూర్రోచ్



75 పరుగులు చేసిన ఆర్యవట్‌శర్మ

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న కల్నల్ సీకే నాయుడు అండర్ –23 అంతర్ రాష్ట్రాల క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్రా జట్టు ఆధిక్యంలో కొనసాగుతోంది. 159 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో బరిలో దిగిన హిమాచల్ ప్రదేశ్ జట్టు 124.3 ఓవర్లలో 436 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులోని ఆర్యవట్‌శర్మ 75 పరుగులు, త్రిడిల్ పి సూర్రోచ్ 152 పరుగులు చేశారు. ఆంధ్రా బౌలర్లు వాసు 5, శ్రీకర్ 3, రాజు 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి 8 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 30 పరుగులు చేసింది. జట్టులోని రేవంత్ రెడ్డి 15 పరుగులతో క్రీజ్‌లో ఉన్నాడు. ఆంధ్రా జట్టు 138 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

హోంగార్డ్స్ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి



గౌరవ వందనం స్వీకరిస్తున్న హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్‌కుమార్

కడప అర్బన్ : పోలీసు శాఖలో హోంగార్డుల సేవలు అభినందనీయమని, క్రమశిక్షణతో విధులను నిర్వర్తించాలని హోంగార్డ్స్ కమాండెంట్ ఎం. మహేష్‌కుమార్ తెలిపారు. సోమవారం కడప పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో హోంగార్డులు పెరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమాండెంట్ మాట్లాడుతూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తూ మంచిపేరు తీసుకురావాలన్నారు. హోంగార్డుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. సంవత్సరానికి ఒకసారి మెడికల్ చెకప్ చేసుకోవాలన్నారు. హోంగార్డుల దైనందిన విధులు సవాళ్లతో కూడుకున్నవన్నారు. ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డ్రిల్, కవాతు, ప్రముఖుల బందోబస్తు, ట్రాఫిక్ తదితర విధులు మరింత సమర్థవంతంగా ఎలా నిర్వహించవచ్చో వివరించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య, ఏ.ఆర్. డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీశైలం రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దాడి కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

పులివెందుల రూరల్ : జనవరి 29వ తేదీన తొండూరు మండలం ఇనగలూరు గ్రామానికి చెందిన దస్తగిరి రెడ్డిపై జరిగిన దాడి కేసులో నలుగురు నిందితులలో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ మురళీ నాయక్ తెలిపారు. సోమవారం స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జనవరి 29వ తేదీన ఇనగలూరు గ్రామానికి చెందిన దస్తగిరిరెడ్డి అలియాస్ బాబు రెడ్డి సొంత పని నిమిత్తం పులివెందులకు వచ్చాడన్నారు. తన పని ముగించుకుని తిరిగి గ్రామానికి వెళ్తున్న సమయంలో గ్రామ సమీపంలో అదే గ్రామానికి చెందిన మోరంరెడ్డి సమరసింహారెడ్డి, మోరంరెడ్డి హరి కిశోర్ రెడ్డి అలియాస్ కిశోర్ కుమార్ రెడ్డి, మోరంరెడ్డి బాల ఓబుల్ రెడ్డి, భాస్కర్ రెడ్డిలు కాపు కాచి దాడి చేశారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసుకు సంబంధించి పులివెందుల రూరల్ సీఐ రమణ ఆధ్వర్యంలో సింహాద్రిపురం ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్, తొండూరు ఎస్‌ఐ చిన్న ఓబన్న, వారి సిబ్బంది సోమవారం ఉదయం నిందితులను అరెస్టు చేశారన్నారు. నిందితులు తమ వ్యవసాయ పొలంలో సుమారు రెండేళ్ల క్రితం నాటిన సుమారు 350 చీనీ చెట్లకు కరువు పని బిల్లులు చేయించుకునే విషయమై, దస్తగిరి రెడ్డికి, నిందితులకు మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయన్నారు. ఇందులో భాగంగానే ఈ దాడి జరిగిందన్నారు. కాగా ఈ కేసుకు సంబంధించి మరో నిందితుడు ఒక దినపత్రికలో విలేకరిగా పనిచేస్తున్న భాస్కర్ రెడ్డి పరారీలో ఉన్నాడని తెలిపారు. అతని కోసం గాలిస్తున్నామన్నారు. సమావేశంలో సీఐ వెంకటరమణ, ఎస్‌ఐలు తులసీ నాగప్రసాద్, పెద్ద ఓబన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : రూరల్ పరిధిలోని కానపల్లె గ్రామంలో తాటి గంగయ్య (54) అనే వ్యక్తి మనస్థాపంతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగయ్య, రాజమ్మ భార్యా భర్తలు. వీరికి పిల్లలు లేరు. భార్యాభర్తలు కూలి పని చేసుకొని జీవించేవారు. సీజన్‌లో గంగయ్య పొట్టేళ్లను పెంచుకొని విక్రయించుకునేవాడు. గంగయ్య స్వగ్రామం ముద్దనూరు మండలంలోని తిమ్మాపురం. కానపల్లెలోనే పెళ్లి చేసుకొని 35 ఏళ్ల నుంచి అక్కడే ఉంటున్నాడు. గ్రామంలో ఉన్న తమ 5 సెంట్ల స్థలాన్ని విక్రయించి సొంతూరు తిమ్మాపురం గ్రామానికి వెళ్లాలని భావించారు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం స్థలాన్ని విక్రయించారు. స్థలం విక్రయించిన డబ్బు విషయమై భార్యాభర్తలు ఆదివారం రాత్రి గొడవ పడ్డారు. దీంతో భార్య రాజమ్మ రాత్రి భయంతో ఇంటి నుంచి వెళ్లిపోయి గ్రామంలోనే ఉన్న బంధువుల ఇంట్లో పడుకుంది. రాత్రి నిద్రపోయిన గంగయ్య సోమవారం వేకువ జామున చూసే సరికి ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డులోని ఇనుప పైపునకు తాడుతో ఉరి వేసుకున్నాడు. భార్యతో పాటు బంధువులు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ సురేష్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి తమ్ముడు గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : ముద్దనూరు రోడ్డు సమీపంలోని జయమ్మ కాలనీలో నివాసముంటున్న సంజీవరాయుడు(30) అనే వ్యక్తి సోమవారం రాత్రి ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా.. సంజీవ రాయుడు పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో టైలరింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొంతకాలంగా చెవినొప్పితో తీవ్రంగా బాధపడుతుండేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బెంగళూరులో పులివెందుల యువకుడు..

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని నగరిగుట్ట సమీపంలో నివాసముంటున్న మాజీ కౌన్సిలర్ సూర్యనారాయణరెడ్డి మనుమడు, అమరనాథ్ రెడ్డి, అనితల కుమారుడు అరవిందనాథ్ రెడ్డి(22) రెండు రోజుల క్రితం బెంగళూరులో ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పులివెందుల పట్టణంలో అమరనాథ్ రెడ్డి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి కుమారుడు అరవిందనాథ్‌రెడ్డితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అరవిందనాథ్‌రెడ్డి బెంగళూరులోని సూపర్ మార్కెట్‌లో పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం విషద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

లారీ బోల్తా – డ్రైవర్ మృతి



బోల్తాపడిన లారీ

కాశినాయన : మండలంలోని రామచంద్రాపురం గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం లారీ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. డ్రైవర్ రాజుగా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి సిమెంట్ లోడుతో ప్రొద్దుటూరుకు వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక చిన్నమండెం ఉరుసు



షాహీద్‌బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి

చిన్నమండెం : సమైక్యతకు, మత సామరస్యానికి ప్రతీక చిన్నమండెం ఉరుసు అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం చిన్నమండెంలోని హజరత్‌షా అలీ గంజీ షాహీద్ బాబా రాహమతుల్లా అలైహి దర్గాలో జరిగిన ఉరుసులో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కడప పెద్ద దర్గా పీఠాధిపతి సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేని వద్ద శ్రీకాంత్‌రెడ్డి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, మత సామరస్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిన్నమండెం వైస్ ఎంపీపీ ఏజాస్‌ఆలీఖాన్, సర్పంచ్ నజీర్ అహమ్మద్, షారుల్లా, మహమ్మద్‌ఖాన్, కో ఆప్షన్ సభ్యుడు గౌస్‌సాబ్, మండల జేసీఎస్ కన్వీనర్ చుక్కా అంజనప్ప, బురాన్‌ఖాన్, యేహియాఖాన్, సజ్జాద్, అజ్రూ, జహీర్, సాదిక్, ఖదీర్, సిబకతుల్లాఖాన్, నాసర్ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువ నీటి సామర్థ్యం పెంచాలి



హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని పెంచాలని కోరుతూ సబ్ కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో మహాధర్నా

మదనపల్లె : హంద్రీనీవా కాలువ నీటి సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులకు పెంచి, రాయలసీమకు సాగు, తాగునీరు అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అలాగే చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ పనులు పూర్తి చేసి, మదనపల్లెకు మంచినీరు అందించాలని, అందుకు సంబంధించిన నిధులను రాబోయే బడ్జెట్‌లో కేటాయించాలని కోరారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మురళి అధ్యక్షతన, సోమవారం సబ్ కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలైన కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు హంద్రీనీవా ప్రాజెక్ట్ ద్వారా దాదాపు 6 లక్షలకు పైగా ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాల్సి ఉందన్నారు. 2012 నుంచి కర్నూలు, అనంతపురం జిల్లాలకు నీరు వస్తున్నా ఒక్క ఎకరం ఆయకట్టుకు సాగు నీరు ఇవ్వకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మొదటి దశ కింద అనంతపురం జిల్లాలో 3.45 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వడానికి పంట కాలువలు తవ్వలేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా రాయలసీమ సాగునీటి వనరుల అభివృద్ధి ఆశించినంతగా జరగడం లేదన్నారు. హంద్రీనీవా కాలువ వెడల్పు చేయడం, పంట కాలువలను తవ్వడం కార్యక్రమాలను తక్షణం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నర్సింహులు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రెడ్డి సాహెబ్, బహుజన సేన రాష్ట్ర నాయకుడు శ్రీ చందు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు హరి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



మృతురాలు కవిత

బి.కొత్తకోట : ఓ వివాహిత బావిలో శవమై తేలిన ఘటన సోమవారం బి.కొత్తకోట మండలం బయ్యప్పగారిపల్లె పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్తులు, సీఐ జీవన్ గంగనాథ్ బాబు కథనం మేరకు వివరాలు. పప్పిరెడ్డిగారిపల్లికి చెందిన పి.శంకర్‌రెడ్డి, పి.కవిత (35)లకు 18 ఏళ్ల క్రితం వివాహమైంది. శంకర్‌రెడ్డికి మొదటి భార్యకు విడాకులు ఇచ్చి కవితను రెండో వివాహం చేసుకున్నాడు. వీరిద్దరు అంగళ్లులోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరిద్దరి మధ్య పదిరోజులుగా గొడవలు చోటుచేసుకుంటున్నాయి. దీనికి కారణం ఓ వ్యక్తి నుంచి కవిత మొబైల్‌కు మెసేజ్‌లు వస్తుండటమేనని అనుమానిస్తున్నారు. ఈ విషయమై తరచూ గొడవలు పడుతుండగా ఆదివారం రాత్రి కూడా భార్యాభర్తలు గొడవపడ్డారు. ఆ తర్వాత కవిత గ్రామానికి కిలోమీటరు దూరంలోని బావిలో శవమై ఉండటం సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న సీఐ జీవన్ గంగనాథ్ బాబు బావి వద్దకు వెళ్లి పరిశీలించారు. మృతురాలి ఒంటిపై బెల్టుతో కొట్టిన గాయం ఉంది. మృతురాలి చిన్నాన్న జయరామిరెడ్డి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయొద్దు



సమావేశానికి హాజరైన యూటీఎఫ్ నాయకులు

రాయచోటి అర్బన్ : జీఓ నంబర్ 117కు ప్రత్యామ్నాయ మార్గదర్శకాల పేరుతో జరుగుతున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విలీనాన్ని ఆపాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయవద్దని విద్యాశాఖ ఉన్నతాధికారులకు యూటీఎఫ్ నేతలు విజ్ఞప్తి చేశారు. సోమవారం పట్టణంలో యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ మాట్లాడుతూ 117 జీఓను రద్దు చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తన హామీని గాలికి వదలేసిందన్నారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రాథమిక పాఠశాలలన్నింటిని యథావిధిగా కొనసాగించాలన్నారు. దూరంతో సంబంధం లేకుండా 60కి పైబడి విద్యార్థుల సంఖ్య ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలన్నింటిని ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు శివారెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్, నేతలు చంగల్‌రాజు, వెంకటరమణ, వెంకటసుబ్బయ్య, అక్రంబాషా, శ్రీధర్ రెడ్డి, ఆదినారాయణ, దావుద్దీన్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.